క్లుప్తంగా

వర్షాలతో రైతులకు ఊరట

నెల్లూరు రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిస్తున్నాయి. వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో వరి, మెట్ట పంటలైన పెసర, నువ్వు సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు అనుగుణంగా రూరల్ మండల వ్యవసాయాధికారులు రైతులకు అవసరమైన విత్తనాలను అందించే దిశగా చర్యలు చేపడుతున్నారు. సోమవారం కూడా ఎడతెరపిలేని వర్షం కురవడం రైతులకు అనుకూలంగా మారింది. కాగా నెల్లూరు నగర శివారులోని తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, రెవెన్యూ కాలనీ, తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. వివిధ పనులకు వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వైభవంగా కృత్తిక పౌర్ణమి



నెల్లూరు(బృందావనం): కృత్తిక పౌర్ణమిని పురస్కరించుకుని రంగనాయకులపేటలో ని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం దీపారాధన, రాత్రి పేట ఉత్సవం, లంకా దహనం కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాడిశెట్టి గురునాథం, సరోజని దంపతులు వ్యవహరించారు.

నేత్రపర్వంగా కల్యాణం



నెల్లూరు(బృందావనం): కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. మందిర నిర్వాహకులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, మస్తాన్‌రావు, జేవీ శేషగిరిరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై శిక్షణ



నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరు జెడ్పీ హైస్కూల్‌లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిసెంబర్‌లో జరిగే క్రీడలకు సంబంధించి స్కూల్ పీడీ నాగేంద్రకుమార్ పర్యవేక్షణలో గ్రామ సచివాలయాల కమిటీ సభ్యులు, స్పోర్ట్స్ వలంటీర్లకు క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. జిల్లా క్రీడా విభాగం అధికారి యతిరాజు, రూరల్ నియోజకవర్గ పీడీలు సుకుమార్, దిలీప్, ముని, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ కోరారు. గొల్లకందుకూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్రను సోమవారం ఆయన ప్రారంభించారు. పీఎం కిసాన్ పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రయోగాత్మకంగా డ్రోన్ సాయంతో పంట పొలాలకు మందులు పిచికారీపై అవగాహన కల్పించారు. ఏఓ నాగమోహన్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీలపై అవగాహన కల్పించారు. ఏపీఎం సరిత, ఉద్యానశాఖ అధికారి ప్రసన్న, వీఏఏలు సురేష్, వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏదీ చె(చి)త్త శుద్ధి?



నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లోని హరనాథపురం రెండో వీధిలో రామాలయం సమీపంలో చెత్తను రోడ్డుపై పడేస్తున్నారు. చెత్తను ఆవులు, పందులు, కుక్కలు చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటున్నా పారిశుధ్య సిబ్బంది తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు స్పందించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శైవక్షేత్రాల్లో కార్తీక శోభ



మూలస్థానేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నెల్లూరు(బందావనం) : నగరంలోని శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పవిత్ర కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కొలువులకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదిదంపతులను దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల శివ నామస్మరణతో ముక్కంటి నిలయాలు హోరెత్తాయి. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, దర్గామిట్టలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, సీఏఎం స్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర ఆలయం, ములుముడి బస్టాండ్ సమీపంలోని భ్రమరాంబ సమేత హరిహరనాథ ఆలయంలో ఆదిదంపతులకు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు, ఉత్సవాలు నిర్వహించారు.

➡ భక్తవత్సలనగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో భక్తి సేవాదళ్ ఆధ్వర్యంలో గణపతి హోమం, మహారుద్రాభిషేకం, మహాకార్తీక దీపోత్సవం నిర్వహించారు. భక్తిసేవాదళ్ నిర్వాహకులు శ్రీకంఠం మనోహర్, సభ్యులు, మందిర చైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

➡ నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో కొలువైన మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి సన్నిధిలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

➡ మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఉభయకర్తలుగా చింత కృష్ణకిషోర్, గాయత్రి దంపతుల వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషా కుమారి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తవత్సలనగర్‌లోని సాయిబాబా మందిరంలో శివుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం



మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి సన్నిధిలో మహారుద్రాభిషేకం



శంకరమఠం ప్రాంగణంలో చండీ హోమం

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



శ్రీకృష్ణమందిరంలో విశేషాలంకారంలో రమాసత్యనారాయణస్వామి



రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం



వ్యాసరాజ మఠంలో రమాసత్యనారాయణస్వామి కల్యాణం

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరం ప్రాంగణంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. అఖండ దీపారాధన, ఆకాశదీపం ఉభయకర్తలుగా మాచిరాజు మల్లికార్జునరావు, శోభారాణి దంపతులు వ్యవహరించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా శాఖ సమన్వయకర్త ఆర్ స్వామినాయక్ ఆధ్వర్యంలో అన్నమయ్య సంగీత విభావరి నిర్వహించారు. మందిరం నిర్వాహకులు బీ రాఘవేంద్రరావు, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

➡ నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా రమాసత్యనారాయణస్వామి కల్యాణం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సంతపేట, బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మందిరంలో సోమవారం కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం, పేట ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా మమత, అశోక్‌రెడ్డి, పద్మ, వెంకటరమణ దంపతులు వ్యవహరించారు. కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్ఠానం అధ్యక్షుడు కేఎస్ శ్రీధరాచార్య, శ్రీరాఘవేంద్రస్వామి మఠం ట్రస్టీ గురుచరణ్, సింహపురి మధ్వసంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, శ్రీవ్యాసరాజ మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకులు అరవపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు..బంగ్లాతోటలో రాఘవరెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఇంటికి తాళం వేసి చికిత్స నిమిత్తం పది రోజుల కిందట చెన్నైకు తీసుకెళ్లారు. ప్రతిరోజూ పనిమనిషి వెంకమ్మ ఇంటికి వచ్చి వాకిలి శుభ్రం చేసి వెళ్లేది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె వాకిలి శుభ్రం చేసేందుకు రాగా వెనుకవైపు తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో అనుమానంతో జరిగిన విషయాన్ని ఇంటి యజమానికి తెలియజేసింది. సోమ వారం ఆయన నెల్లూరుకు చేరుకుని ఇంట్లో పరిశీలించగా బీరువాలోని రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలు, ఇంటి ఆవరణలో పార్క్‌చేసి ఉన్న స్కూటీ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీనుల విందుగా సంగీత నీరాజనం



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సోమవారం కృష్ణవేణి సంగీత నీరాజన కార్యక్రమాన్ని వీనుల విందుగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ-భాషా సాంస్కృతిక శాఖ, కేంద్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత కళాకారులు కే గాయత్రి గాత్రానికి దీపికా వెంకట్రామన్ (వయోలిన్), కిషోర్‌రమేష్ (మృదంగం)బృందం వాయిద్య సహకారం అందించారు.ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్వీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి పర్యవేక్షించారు.

వైభవంగా గరుడ సేవ



నెల్లూరు రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యానికి సహకరించాలి

నెల్లూరు(బారకాసు): క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా కార్పొరేషన్ పరిధిలో ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న పారిశుధ్య పనులకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, బాలాజీనగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా నిల్వ చేసి చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు అందజేయాలని సూచించారు. కమిషనర్ వెంట ట్రెయినీ కలెక్టర్ సంజనాసింహా, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, శానిటేషన్ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు ఉన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న కారు



ఎడ్ల బండి టైర్ కింద గాయపడిన మునిస్వామి



దెబ్బతిన్న కారు

- వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు మితిమీరిన వేగంతో ముందు వెళుతున్న ఎడ్ల బండిని ఢీకొనడంతో ఎడ్ల బండి యజమాని గాయపడ్డాడు. ఈ ఘటన జాతీయ రహదారిపై పెన్నాబ్రిడ్జి వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు. ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కే మునిస్వామికి ఎడ్ల బండి ఉంది. ఆయన రోజూ పెన్నానది నుంచి ఇసుక తీసుకొచ్చేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఎడ్ల బండిపై జాతీయ రహదారిపై పెన్నానదికి బయలుదేరాడు. పెన్నా బ్రిడ్జి మీదకు వచ్చేసరికి చెన్నై నుంచి కావలి వైపు వెళుతున్న కారు వెనుకగా ఎడ్ల బండిని వేగంగా ఢీకొంది. దీంతో మునిస్వామికి కాలువిరిగి తీవ్రగాయమైంది. ఎద్దులు సైతం గాయపడ్డాయి. కారు ముందు భాగం దెబ్బతినడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు మునిస్వామి నార్త్‌ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీఈఓ గంగాభవానిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో సకాలంలో పుస్తకాలు అందకపోవడం వల్ల సిలబస్ పూర్తి చేయడంలో వెనకబడ్డారన్నారు. షోకాజ్ నోటీసులు అందుకున్న 54 మంది ఉపాధ్యాయులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. ఈ విషయంపై స్పందించిన డీఈఓ వచ్చే నెలాఖరు వరకు సమయం ఇస్తామని, ఇప్పుడున్న కారణాలను సరిచేసుకోవాలని సూచించారు. ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, నాయకులు హజరత్, చలపతిశర్మ, ఏడుకొండలు, డేవిడ్, రాజమనోహర్, దశరథరాములు, పిచ్చిబాబు, ప్రసాద్, సుబ్బు, నవకోటేశ్వరరావు, వేణుగోపాలరావు, ఆదినారాయణ, అచ్చయ్య, శ్రీనివాసులరెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

- కమిషనర్ వికాస్‌మర్మత్



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో 41 ఫిర్యాదులు అందగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ 4, హెల్త్ 4, హౌసింగ్ 5, టౌన్‌ప్లానింగ్ 8, ఎస్టాబ్లిష్‌మెంట్ 6 చొప్పున ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమాలకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు ఎండార్స్‌మెంట్‌లను సంబంధిత విభాగాధిపతులు పరిశీలించాలని సూచించారు. విభాగాల వారీగా 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారం అనంతరం సంబంధిత ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో సమీక్ష చేస్తామన్నారు. వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమానికి కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. నగర వ్యాప్తంగా నూతన రోడ్ల నిర్మాణ, మంచినీటి సరఫరా, పార్కుల నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ట్రెనీ కలెక్టర్ సంజనాసిన్హా, అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, మేనేజర్ ఇనయతుల్లాతో పాటు అన్ని విభాగాలకు చెందిన పలువురు కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా రవాణా సేవలు



రవాణా కార్యాలయానికి వచ్చిన వ్యక్తిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీటీసీ చందర్

నెల్లూరు (టౌన్): రవాణా కార్యాలయంలో పారదర్శకంగా సేవలు అందించే విధంగా రవాణా అధికారులు చర్యలు చేపట్టారు. రవాణా శాఖలో 83 రకాల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏ వాహనదారుడు కార్యాలయానికి రాకుండా ఇంటి వద్ద లేదా సమీపంలోని ఆన్‌లైన్ సెంటరు నుంచే తమకు కావాల్సిన సేవలను చేసుకునే విధంగా వీలు కల్పించింది. అయితే వాహనానికి సంబంధించి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే దరఖాస్తు పెండింగ్‌లో పడుతుంది. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు దళారులు మేము మీ పనులు చేసి కాగితాలు ఇస్తామని చెబుతూ వాహనదారుల నుంచి డబ్బులు తీసుకుని వారితో పాటు నేరుగా కార్యాలయానికి వస్తున్న పరిస్థితి ఉంది. దీంతో దళారులు, ప్రైవేట్ వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతించకుండా ప్రతిరోజూ గేటు వద్ద వంతుల వారీగా ఒకరిని రవాణాధికారులు నియమిస్తున్నారు. సంబంధిత రవాణా ఉద్యోగులు పనిమీద కార్యాలయానికి వస్తున్న వారి పత్రాలను చూసిన తరువాతే లోపలికి అనుమతి ఇస్తున్నారు. రవాణా ఉద్యోగులు సక్రమంగా పని చేస్తున్నారా.. లేదా అన్న దానిపై డీటీసీ చందర్ నేతృత్వంలో ఆర్టీఓ సరిచందన, ఏఓలు కిషోర్, రామ్మోహన్ ప్రతిరోజూ తనిఖీ చేస్తున్నారు. సేవల కోసం ఎవరూ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని డీటీసీ చందర్ తెలిపారు. పెండింగ్ పడ్డ సేవల కోసం కార్యాలయానికి రాకుండా ఆన్‌లైన్ సెంటరులోని టికెట్ పెట్టుకోవచ్చని చెప్పారు. దళారులు, ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే అనిల్‌పై నిందలను సహించబోం



విలేకరులతో మాట్లాడుతున్న మత్స్యకార సొసైటీ నగరాధ్యక్షురాలు పిలిమిట్ల అరుణమ్మ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తమ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై నిందలు మోపితే సహించబోమని మత్స్యకార సొసైటీ నగర అధ్యక్షురాలు పిలిమిట్ల అరుణమ్మ హెచ్చరించారు. సోమవారం ఆమె నగరంలోని చేపల మార్కెట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపల మార్కెట్‌కు వచ్చి ఏ ఒక్కరూ తమను పరామర్శించ లేదన్నారు. తమపై అనేక దాడులు జరిపి కేసులు బనాయించారన్నారు. అప్పట్లో చేపల మార్కెట్ నిర్మాణంలోని అవకతవకలను పలుమార్లు అప్పటి మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే అనిల్ కుమార్ మంత్రిగా మార్కెట్‌కు వచ్చి తమ సమస్యలు విని నిధులు తీసుకొచ్చి తమకు అనుకూలంగా చేపల మార్కెట్‌ను నిర్మించారని తెలిపారు. తమ ప్రాంతంలో నారాయణ సిబ్బంది ఓటీపీలు తీసుకుని వైఎస్సార్‌సీపీ ఓటర్ల వివరాలను సేకరించడమే కాకుండా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేయిస్తున్నాడని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ ఓట్లు చోరీ చేసి అనవసరంగా తమ ఎమ్మెల్యే అనిల్‌పై నిందలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తమ ఓట్లు చోరీ చేస్తూ ఓటీపీలు తీసుకునేవారి నుంచి తమకు రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మానిగల సునీల్, మత్స్యకార సొసైటీ సభ్యులు అమ్ములు, లక్ష్మి, మనోహర్, వెంకటేశ్వర్లు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



ఆడుదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారుడికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించినట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. పాతమున్సిపల్ కార్యాలయ సమీపంలోని 50/3, 49/1, 2, 48/1, 2, 3 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులకు టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరిగే క్రీడలను విజయవంతం చేసేందుకు అందరూ తమవంతు సహకరించాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి

కార్పొరేషన్ పరిధిలోని ఏపీ టిడ్కో(జీ+3) గృహాలకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ బ్యాంకు అధికారులను కోరారు. అల్లీపురంలోని గృహాలకు సంబంధించి రుణాల మంజూరుపై వివిధ బ్యాంకుల ప్రతినిధులు, హౌసింగ్ విభాగ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశం కమిషనర్ మాట్లాడుతూ డిసెంబరు 8వతేదీ లోపు పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ రుణాలను మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. గృహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారుల స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. టిడ్కో గృహసముదాయాల్లో త్వరితగతిన మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ఈ జాన్‌సైమన్‌రావు, మెప్మా పీడీ రవీంద్ర, ఎల్‌డీఎం ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏపీజీబీ, యూకో, ఎస్‌బీఐ, కెనరా, యూనియన్ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సీఎంఎంలు, హౌసింగ్ విభాగాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ వద్ద హైడ్రామా

- ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు
- మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్ వద్ద సోమవారం హైడ్రామా చోటుచేసుకుంది. గూడూరు డివిజన్, మనుబోలు సెక్షన్ పరిధిలోని వీరంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న చిట్టేటి భానుచందర్‌ను గత నెల రోజుల క్రితం విధులు నుంచి తొలగించడం జరిగింది. తిరిగి అతన్ని విధుల్లోకి తీసుకోవాలని విద్యుత్‌భవన్ ముట్టడికి షిఫ్ట్‌ఆపరేటర్ భానుచందర్‌తో కలిసి జిల్లా యానాది సంఘం, జనసేన నాయకులు యత్నించారు. అయితే పోలీసులు ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో మహిళా కానిస్టేబుల్ మల్లికకు రక్త గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఘటనా స్థలికి హుటాహుటిన ఎస్ఈ

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ హుటాహుటిన విద్యుత్‌భవన్ వద్దకు వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. షిఫ్ట్ ఆపరేటర్ భానుచందర్ విషయమై ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో ఒక కమిటీని వేసి వారంలోగా నివేదిక తయారు చేసి సీఎండీకు నివేదికను అందజేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన కారులు తమ ఆందోళనను విరమించారు.